

RNI: APTEL/2010/36742

# న్యూస్ వార్
వార్తా పత్రిక

TELANGANA RISING GLOBAL SUMMIT

నల్లగొండ | epaper.news war.com | బుధవారం 8, ఏప్రిల్ 2026 | సంపుటి :16 సంచిక :19 | ఎడిటర్: నటవా కృష్ణారావు | పేజీలు : 4 , వెల.2.00

## 120 నెలల విజయన్ పాలన కాలం
# వైఫల్యానికి ప్రతీక

### పినరయి విజయన్ వైదొలిగే సమయం ఆసన్నమైంది"
### యూడీఎఫ్ విజయం ఖాయం
### ఊమెన్ చాందీ తరహా పాలన అందిస్తాం"
### కోవలంలో రేవంత్ బాంబ్ స్పీచ్..
### పినరయిపై నిప్పులు..



కేరళ అసెంబ్లీ ఎన్నికల ప్రచారం సుడిగాలి రేంజ్‌లో సాగుతోంది. ఈ పరిస్థితుల్లో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేడు కోవలంలో యూడీఎఫ్ అభ్యర్థి విన్సెంట్‌కు మద్దతుగా భారీ రోడ్‌షో నిర్వహించారు. వేల మంది ప్రజలు తరలివచ్చి రేవంత్‌ను ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సంచలన ప్రసంగం కేరళ రాజకీయాలను మరింత హాట్ చేసింది. "కేరళంలో పంచాయతీరాజ్ వ్యవస్థ విజయం సాధించింది.. దానిని మేం అభినందిస్తున్నాం. ఈ ఘనత కాంగ్రెస్ ముఖ్యమంత్రులు కరుణాకరన్, ఊమెన్ చాందీలది. ఎక్కడైనా మంచి జరిగితే మేం అభినందిస్తాం" అని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

వార్త 2లో



## బెంగాల్‌పై కన్నేస్తే పాక్ ఎన్ని ముక్కలవుతోందో దేవుడికే తెలియాలి: రాజ్‌నాథ్ సింగ్

కోల్‌కతాపై దాడి చేస్తామన్న పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ వ్యాఖ్యలపై కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఘాటుగా స్పందించారు. ఇలాంటి రెచ్చగొట్టే ప్రకటనలను ఆయన చేయకుండా ఉండాల్సిందని, బెంగాల్‌పై కన్నేస్తే పాకిస్థాన్ ఎన్ని ముక్కలుగా విడిపోతుందో భగవంతుడికే తెలియాలని అన్నారు.'

2



## ఫేక్ ప్రిడిక్షన్‌లను నమ్మొద్దు.. జాగ్రత్త: సీపీ సజ్జనార్

ఐపీఎల్ మ్యాచ్‌ల పేరుతో ఆన్‌లైన్ బెట్టింగ్ మోసాలు పెరిగిపోతున్నాయని... ఈ ఉచ్చులో పడవద్దని హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ సజ్జనార్ హెచ్చరిక జారీ చేశారు. ఆన్‌లైన్ బెట్టింగ్‌పై సామాజిక మాధ్యమం ఎక్స్‌లో సీపీ స్పందించారు. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో ఫేక్ క్రికెట్ ప్రిడిక్షన్ ఛానెల్స్ దందా చేస్తున్నాయని.. టాస్, మ్యాచ్ ఫలితాలు ముందే చెబుతామని అమాయకులను బెట్టింగ్ ఉచ్చులోకి లాగుతూ మోసం చేస్తున్నాయని సీపీ తెలిపారు.

2



## లాకప్ డెత్ కేసులో పోలీసులకు మరణశిక్ష.. కమల్‌హాసన్ కీలక వ్యాఖ్యలు

2

తమిళనాడులో తండ్రీకొడుకుల లాకప్ డెత్ కేసులో 9 మంది పోలీసులకు కోర్టు ఇటీవల మరణ శిక్ష విధించడంపై నటుడు కమల్ హాసన్ తాజాగా కీలక వ్యాఖ్యలు చేశారు.

## అజాగ్రత్తగా వాహనాలు నడిపి
# ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దు

### డీజీపీ శివధర్ రెడ్డి



అజాగ్రత్తగా వాహనాలు నడిపి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని, రోడ్ సేఫ్టీ అన్నిటికన్నా ముఖ్యమని తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి వ్యాఖ్యానించారు. సురక్షిత డ్రైవింగే అన్ని విధాలుగా మేలని పేర్కొన్నారు. ఈరోజు(మంగళవారం) వెంకటాపురం మండల కేంద్రంలో అరీవ్ అలైవ్ కార్యక్రమానికి డీజీపీ శివధర్ రెడ్డి, ఎస్ఐబీ చీఫ్ సుమతి హాజరయ్యారు. ఈ సందర్భంగా రహదారి భద్రత రూల్స్ పాటిస్తామని ప్రమాణం చేయించారు. అనంతరం డీజీపీ శివధర్ రెడ్డి మాట్లాడారు.

2

## మళ్లీ అధికారంలోకి రావాలంటే..
# సైనికుల్లా పని చేయాలి: టీపీసీసీ చీఫ్



తెలంగాణలో కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి రావాలంటే సైనికుల్లా పని చేయాలని పార్టీ కార్యకర్తలకు పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. తెలంగాణలో బీఆర్ఎస్, బీజేపీలు అధికారంలోకి రావని ఆయన జోస్యం చెప్పారు. బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కావాలని బావా బామ్మర్దులు హరీశ్ రావు, కేటీఆర్ కొట్లాడుకుంటున్నారని విమర్శించారు. మంగళవారం నాగర్ కర్నూల్‌లో కొత్తగా ఏర్పాటైన జిల్లా కాంగ్రెస్ పార్టీ నేతల ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పీసీసీ చీఫ్ మాట్లాడుతూ.. ప్రధాని మోదీ పేదలకు చేసింది ఏమి లేదన్నారు. అలాంటి పార్టీ రాష్ట్రంలో ఎలా అధికారంలోకి వస్తుందని ప్రశ్నించారు.

2

## రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడు
# జరిగినా.. సింగిల్ డిజిట్‌కే కాంగ్రెస్ పరిమితం



సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు మళ్లీ నిప్పులు చెరిగారు. మంగళవారం శంషాబాద్ పోలీస్ స్టేషన్ వద్ద హరీశ్ రావు మాట్లాడుతూ.. రేవంత్ నువ్వు మళ్ళీ గెలవడం కాదు కదా ప్రతిపక్ష హోదా కూడా నీ పార్టీకి రాదని జోస్యం చెప్పారు. రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడు జరిగినా కాంగ్రెస్ పార్టీ సింగిల్ డిజిట్‌కే పరిమితం అవుతుందని స్పష్టం చేశారు.

వార్త 2లో

## 140 లక్షల మంది ఇరానియన్లు
# ప్రాణత్యాగానికి సిద్ధం: ఇరాన్ అధ్యక్షుడు



హోర్ముజ్ జలసంధిని తెరవకుంటే ఇరాన్‌ను సర్వనాశనం చేస్తామంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన గడువు సమీపిస్తుండగా ఇరాన్ అధ్యక్షుడు పెజిష్కియాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. దేశాన్ని కాపాడుకునేందుకు ఇరాన్ ప్రజలు ప్రాణత్యాగానికి కూడా సిద్ధంగా ఉన్నారని సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. దేశం కోసం తాను సైతం ప్రాణత్యాగానికి సిద్ధమేనని అన్నారు. 'ఇరాన్‌ను కాపాడుకునేందుకు ప్రాణత్యాగానికి సిద్ధమని ఇప్పటి వరకూ 140 లక్షల మందికి పైగా ఇరాన్ ప్రజలు ప్రకటించారు. నేను సైతం ఇరాన్ కోసం ప్రాణత్యాగానికి సిద్ధం' అని పెజిష్కియాన్ పేర్కొన్నారు.

వార్త 2లో

# బెంగాల్‌పై కన్నేస్తే పాక్ ఎన్ని ముక్కలవుతోందో దేవుడికే తెలియాలి: రాజ్‌నాథ్ సింగ్

బైరక్‌పుర్: న్యూస్‌వార్ ప్రతినిధి

కోల్‌కతాపై దాడి చేస్తామన్న పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ వ్యాఖ్యలపై కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఘాటుగా స్పందించారు. ఇలాంటి రెచ్చగొట్టే ప్రకటనలను ఆయన చేయకుండా ఉండాల్సిందని, బెంగాల్‌పై కన్నేస్తే పాకిస్థాన్ ఎన్ని ముక్కలుగా విడిపోతుందో భగవంతుడికే తెలియాలని అన్నారు.'పాకిస్థాన్ రక్షణ మంత్రి అలాంటి రెచ్చగొట్టే ప్రకటనలు ఇవ్వకుండా ఉండాల్సింది. 55 ఏళ్ల క్రితం పాకిస్థాన్ రెండు ముక్కలైనప్పుడు ఆ పరిణామాలను వాళ్లు చవిచూశారు. ఈసారి కనుక బెంగాల్‌పై కన్నేస్తే పాకిస్థాన్ ఎన్ని ముక్కలవుతుందో ఆ భగవంతుడికే తెలియాలి' అని రాజ్‌నాథ్ చురకలు వేశారు.భారత్ భవిష్యత్తులో ఎలాంటి దుస్సాహసాలకు పాల్పడినా కోల్‌కతాపై దాడి చేస్తామని ఖవాజా ఆసిఫ్ గత శనివారంనాడు నోరుపారేసుకున్నారు. దీనిపై తృణమూల్ కాంగ్రెస్ పార్టీ అధినేత్ర మమతా బెనర్జీ, ఎంపీ అబిషేక్ బెనర్జీ కేంద్ర ప్రభుత్వంపై విమర్శలకు దిగింది. కోల్‌కతాపై దాడి చేస్తామని బహిరంగంగా బెదిరించినా ఖవాజా ఆసిఫ్ ప్రకటలను ఖండించే ధైర్యం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్‌షాకు లేకుండా పోయిందని అభిషేక్ బెనర్జీ విమర్శించారు. ఒక ఔన్సు ధైర్యం ఉన్నా కేంద్ర బలగాలకు, బీఎస్ఎఫ్, ఇండియన్ ఆర్మీకి పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను తిరిగి పట్టుకునేందుకు స్వేచ్ఛనివ్వాలని అన్నారు. మోదీ, అమిత్, రాజ్‌నాథ్ సింగ్‌కు ఆ సాహసం ఉందా? అని ప్రశ్నించారు. మమతా బెనర్జీ సైతం కోల్‌కతాపై దాడి చేస్తామన్న పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ వ్యాఖ్యలపై ప్రధాని మోదీ ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. భారత్ స్పందన తీవ్రంగా ఉంటుందని ఆయన ఎందుకు హెచ్చరించలేకపోతున్నారు? అని నిలదీశారు. ప్రధాని రాజీనామాకు డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో రాజ్‌నాథ్ సింగ్ తాజాగా స్పందించడం ప్రాధాన్యం సంతరించుకుంది.

# ఫేక్ ప్రిడిక్షన్‌లను నమ్మొద్దు.. జాగ్రత్త: సీపీ సజ్జనార్

హైదరాబాద్, న్యూస్‌వార్ ప్రతినిధి

ఐపీఎల్ మ్యాచ్‌ల పేరుతో ఆన్‌లైన్ బెట్టింగ్ మోసాలు పెరిగిపోతున్నాయని... ఈ ఉచ్చులో పడవద్దని హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ సజ్జనార్ హెచ్చరిక జారీ చేశారు. ఆన్‌లైన్ బెట్టింగ్‌పై సామాజిక మాధ్యమం ఎక్స్‌లో సీపీ స్పందించారు. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో ఫేక్ క్రికెట్ ప్రిడిక్షన్ ఛానెల్స్ దందా చేస్తున్నాయని.. టాస్, మ్యాచ్ ఫలితాలు ముందే చెబుతామని అమాయకులను బెట్టింగ్ ఉచ్చులోకి లాగుతూ మోసం చేస్తున్నాయని సీపీ తెలిపారు. ఇన్‌ఫ్లుయెన్సర్లు కూడా ఈ అసత్య ప్రచారాల్లో పాల్గొంటున్నారని అన్నారు.ఈ ఫేక్ ప్రిడిక్షన్ ఛానెల్స్.. ముందుగా ఎన్‌రోల్ చేయించి, తర్వాత బెట్టింగ్ యాప్‌ల లింకులు పంపి మోసం చేస్తున్నాయని సజ్జనార్ అన్నారు. బెట్టింగ్ వల్ల కష్టపడి సంపాదించిన డబ్బును అమాయకులు కోల్పోతున్నారని ఆయన చెప్పారు. ఫేక్ ప్రిడిక్షన్‌లను ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మొద్దని సీపీ హెచ్చరించారు. ఫేక్ ప్రిడిక్షన్‌లు, బెట్టింగ్‌లపై హైదరాబాద్ సైబర్ క్రైమ్ విభాగం కఠిన చర్యలు తీసుకుంటుందని సీపీ తెలిపారు.ఇప్పటివరకు 494 పెయిడ్ యాడ్స్‌ను సైబర్ క్రైమ్ పోలీసులు బ్లాక్ చేశారని సీపీ చెప్పారు. సోషల్ మీడియాలో 129 ఫేక్ ప్రొఫైళ్లను తొలగించారన్నారు. బెట్టింగ్ యాప్‌లపై నిరంతర నిఘా ఉంటుందని స్పష్టం చేశారు. మోసపూరిత యాడ్స్ కనిపిస్తే వెంటనే రిపోర్ట్ చేయాలని ప్రజలను సీపీ కోరారు. సైబర్ మోసం జరిగితే వెంటనే 1930కి ఫోన్ చేయాలని లేదా ఝఎవతీఝతీఱఎవ.స్త్రశీజ.ఱఅ వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని సీపీ సజ్జనార్ పేర్కొన్నారు.

# లాకప్ డెత్ కేసులో పోలీసులకు మరణశిక్ష.. కమల్‌హాసన్ కీలక వ్యాఖ్యలు

ఇంటర్నెట్ డెస్క్: న్యూస్‌వార్ ప్రతినిధి

తమిళనాడులో తండ్రీకొడుకుల లాకప్ డెత్ కేసులో 9 మంది పోలీసులకు కోర్టు ఇటీవల మరణ శిక్ష విధించడంపై నటుడు కమల్‌హాసన్ తాజాగా కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ కేసులో దోషులకు శిక్ష పడటాన్ని తాను స్వాగతిస్తున్నానని అన్నారు. అయితే, వ్యక్తిగతంగా తాను మరణ శిక్షకు వ్యతిరేకమని చెప్పారు. 'వ్యక్తిగతంగా నేను మరణ శిక్షను వ్యతిరేకిస్తాను. దారుణమైన నేరాలు చేసిన వారికి యావజ్జీవ కఠిన కారాగార శిక్షలు విధించాలి' అని కమల్ అన్నారు.ప్రభుత్వ వ్యవస్థల్లో బాధ్యతాయుత వైఖరి పెరగాలని కూడా కమల్‌హాసన్ అభిప్రాయపడ్డారు. ఈ కేసుకు సంబంధించి అధికారుల చర్యల్లో అనేక లోపాలు ఉన్నాయని కమల్‌హాసన్ అన్నారు. తండ్రీకొడుకుల మృతదేహాలను పరిశీలించకుండానే ప్రభుత్వ వైద్యుడు ఒకరు సర్టిఫికెట్ జారీ చేశారని చెప్పారు. ఈ కేసులో నిజాలను దాచిపెట్టేందుకు ప్రయత్నించిన అధికారులనూ శిక్షించాలని అన్నారు. అధికార దుర్వినియోగానికి పాల్పడే వారి విషయంలో కఠినంగా వ్యవహరించాలని అన్నారు.అధికారం తమను కాపాడుతుందన్న భావనలో ఉండే వారు ఎంతటి ప్రముఖులైనా చట్టప్రకారం కఠినంగా శిక్షించాలని చెప్పారు. ప్రజలను కాపాడాల్సిన వారే ఇంతటి దారుణానికి ఒడిగట్టడం దారుణమని అన్నారు. దోషులు తమ కుటుంబసభ్యులనూ ఇబ్బందుల పాలు చేశారని అన్నారు. ఈ కేసులో న్యాయం కోసం మృతుల కుటుంబసభ్యులు చేసిన పోరాటం, సామాజిక కార్యకర్తలు చూపిన చొరవ, సీబీఐ అధికారుల నిబద్ధత ప్రశంసనీ యమని కామెంట్ చేశారు.2020లో కొవిడ్ సమయంలో అనుమతించిన సమయానికి మించి షాపు తెరిచినందుకు అప్పట్లో పోలీసులు జయరాజ్, ఆయన తనయుడు బెనిక్స్‌ను అరెస్టు చేసి తీసుకెళ్లారు. ఆ తరువాత ఇద్దరినీ కస్టడీలో ఇష్టారీతిన కొట్టడంతో తీవ్రగాయాలపాలైన తండ్రీకొ డుకులు మరణించారు. ఈ కేసులో తాజాగా కోర్టు తొమ్మిది మంది పోలీసులకు మరణ శిక్ష విధించింది.

# అజాగ్రత్తగా వాహనాలు నడిపి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దు: డీజీపీ శివధర్ రెడ్డి

ములుగు,

అజాగ్రత్తగా వాహనాలు నడిపి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని, రోడ్ సేఫ్టీ అన్నిటికన్నా ముఖ్యమని తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి వ్యాఖ్యానించారు. సురక్షిత డ్రైవింగే అన్ని విధాలుగా మేలని పేర్కొన్నారు. ఈరోజు(మంగళవారం) వెంకటాపురం మండల కేంద్రంలో అరీవ్ అలైవ్ కార్యక్రమానికి డీజీపీ శివధర్ రెడ్డి, ఎస్ఐబీ చీఫ్ సుమతి హాజరయ్యారు. ఈ సందర్భంగా రహదారి భద్రత రూల్స్ పాటిస్తామని ప్రమాణం చేయించారు.అనంతరం డీజీపీ శివధర్ రెడ్డి మాట్లాడారు. హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనం నడపొద్దని వాహనదారులకు సూచించారు. కారు బెల్ట్ పెట్టుకోకుండా డ్రైవింగ్ చేయొద్దని అన్నారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడిపి ప్రాణం మీదకు తెచ్చుకోవద్దని సూచించారు. హెల్మెట్ లేకపోవడం వల్లే 75 శాతం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని.. 18 ఏళ్ల నుంచి 40 సంవత్సరాల వారే ఈ ప్రమాదాల బారిన పడుతున్నారని డీజీపీ శివధర్ రెడ్డి పేర్కొన్నారు.అంతకుముందు ములుగు జిల్లాలోని వెంకటాపురం మండలం పామునూరు అటవీ ప్రాంతంలో పోలీస్ ఔట్ పోస్ట్, ఇంటలిజెన్స్ కో ఆర్డినేషన్ సెంటర్‌ను డీజీపీ శివధర్ రెడ్డి, ఐబీ చీఫ్ సుమతి, ప్రిన్సిపాల్ చీఫ్ ఫారెస్ట్ కన్జర్వేటర్ సువర్ణ, సీఆర్పీఎఫ్ అధికారులు ప్రారంభించారు. ఈ సందర్భంగా డీజీపీ శివధర్ రెడ్డి మాట్లాడారు. కర్రెగుట్టల్లో రోడ్లు వేయడం శుభపరిణామమని పేర్కొన్నారు. అభివృద్ధి జరగాలంటే రోడ్ల నిర్మాణం జరగాలని చెప్పుకొచ్చారు. కొన్ని కారణాల వల్ల ఇక్కడ అభివృద్ధి నిలిచిపోయిందన్నారు. తీవ్రవాద ప్రాంతంలో ఇంత త్వరగా రోడ్లు వేయడం అభినందనీయమని అన్నారు. రోడ్లు వేయడంతోనే ఈ ప్రాంత అభివృద్ధి సాధ్యమవుతుందని డీజీపీ శివధర్ రెడ్డి తెలిపారు.

# 120 నెలల విజయన్ పాలన కాలం వైఫల్యానికి ప్రతీక

"పినరయి విజయన్ వైదొలిగే సమయం ఆసన్నమైంది"

యూడీఎఫ్ విజయం ఖాయం

"ఊమెన్ చాందీ తరహా పాలన అందిస్తాం"

కోవలంలో రేవంత్ బాంబ్ స్పీచ్..

## పినరయిపై నిప్పులు..

తిరువనంతపురంన్యూస్‌వార్ ప్రతినిధి

కేరళ అసెంబ్లీ ఎన్నికల ప్రచారం సుడిగాలి రేంజ్‌లో సాగుతోంది. ఈ పరిస్థితుల్లో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేడు కోవలంలో యూడీఎఫ్ అభ్యర్థి విన్సెంట్‌కు మద్దతుగా భారీ రోడ్‌షో నిర్వహిం చారు. వేల మంది ప్రజలు తరలివచ్చి రేవంత్‌ను ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సంచలన ప్రసంగం కేరళ రాజకీయాలను మరింత హాట్ చేసింది. "కేరళంలో పంచాయతీరాజ్ వ్యవస్థ విజయం సాధించింది.. దానిని మేం అభినందిస్తున్నాం. ఈ ఘనత కాంగ్రెస్ ముఖ్యమంత్రులు కరుణాకరన్, ఊమెన్ చాందీలది. ఎక్కడైనా మంచి జరిగితే మేం అభినందిస్తాం" అని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. అయితే పినరయి విజయన్ పాలనను రేవంత్ తీవ్రంగా విమర్శించారు. "పినరయి విజయన్ హయాంలోని వైఫల్యాలను ఎత్తి చూపాను. 120 నెలల విజయన్ పాలన కాలం వైఫల్యానికి ప్రతీకగా నిలిచింది. పినరయి విజయన్ వైదొలిగే సమయం ఆసన్నమైంది" అని ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు. రేవంత్ రెడ్డి మాట్లాడుతూ యూడీఎఫ్ విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. "మూడింట రెండొంతుల మెజారిటీతో మేం గెలవబోతున్నాం. ఊమెన్ చాందీ తరహా పాలన అందిస్తాం" అని ప్రకటించారు. కేరళ యువత వలసల సమస్యను కూడా ఆయన హైలైట్ చేశారు. "కేరళంలో సరైన అవకాశాలు లేకపోవడంతో యువత ఉపాధి కోసం విదేశాలకు వెళ్లారు. యువత వలస వెళ్లడంతో కేరళంలో వృద్ధులు.. చిన్నపిల్లలే కనిపిస్తున్నారు. ఇది దురదృష్టకరం. విద్యావంతులు.. నైపుణ్యం ఉన్న యువత విదేశాలకు వెళ్లడం సరికాదు. వాళ్లు ఇక్కడకు వచ్చి ఉపాధి పొందేలా చేస్తాం" అని హామీ ఇచ్చారు.



# మళ్లీ అధికారంలోకి రావాలంటే.. సైనికుల్లా పని చేయాలి: టీపీసీసీ చీఫ్

నాగర్ కర్నూల్, న్యూస్‌వార్ ప్రతినిధి

తెలంగాణలో కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి రావాలంటే సైనికుల్లా పని చేయాలని పార్టీ కార్యకర్తలకు పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. తెలంగాణలో బీఆర్ఎస్, బీజేపీలు అధికారంలోకి రావని ఆయన జోస్యం చెప్పారు. బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కావాలని బావా బామ్మర్దులు హరీశ్ రావు, కేటీఆర్ కొట్లాడుకుంటున్నారని విమర్శించారు. మంగళవారం నాగర్ కర్నూల్‌లో కొత్తగా ఏర్పాటైన జిల్లా కాంగ్రెస్ పార్టీ నేతల ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పీసీసీ చీఫ్ మాట్లాడుతూ.. ప్రధాని మోదీ పేదలకు చేసింది ఏమి లేదన్నారు. అలాంటి పార్టీ రాష్ట్రంలో ఎలా అధికారంలోకి వస్తుందని ప్రశ్నించారు.కాంగ్రెస్ పార్టీ గుండెకాయ గ్రామాల్లో ఉందని మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. గ్రామాల్లోకి వెళ్లి కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయండంటూ కేడర్‌కు ఈ సందర్భంగా ఆయన సూచించారు. కులాలకు, మతాలకు, ప్రాంతాలకు అతీతంగా పని చేసే కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడి పని చేయాలని కేడర్‌కు స్పష్టం చేశారు. పార్టీలో అందరికీ అవకాశాలు వస్తాయని పేర్కొన్నారు. అలాగే పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును పూర్తి చేసి.. లక్షల ఎకరాలకు సాగు నీరు ఇవ్వాలన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించాలని కేంద్రాన్ని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ.. తన పాదయాత్రలో అన్ని విషయాలను తెలుసుకున్నారని వివరించారు. అందుకే స్థానిక ఎన్నికల్లో బీసీలకు 52 శాతం రిజర్వేషన్లు ఇచ్చామని పీసీసీ చీఫ్ తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రతి పేదవాడికి రేషన్ కార్డు మంజూరు చేశామని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ళు, సన్న బియ్యం, ఉచిత బస్సు సౌకర్యం కల్పించిన ఘనత కాంగ్రెస్ పార్టీకే చెందుతుందన్నారు. పార్టీ అగ్రనేత సోనియాగాంధీ ఇచ్చిన మాట ప్రకారం.. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఇచ్చారని గుర్తు చేశారు. నీళ్లు.. నిధులు.. నియామకాల కోసమే తెలంగాణ వచ్చిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పది సంవత్సరాలలో ఎన్ని నిధులు ఇచ్చారు? ఎన్ని నియామకాలు చేశారు? అంటూ ఆ పార్టీ నేతలను టీ పీసీసీ చీఫ్ సూటిగా ప్రశ్నించారు.బీఆర్ఎస్ ప్రభుత్వం రూ. 8 లక్షల కోట్లు అప్పులు చేసి పోయిందని.. ఆ అప్పులను కాంగ్రెస్ ప్రభుత్వం తీర్చుకుంటూందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇచ్చిన హామీలను సైతం కాంగ్రెస్ పార్టీ నెరవేర్చుకుంటూ ముందుకు వెళ్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, జిల్లా పార్టీ అధ్యక్షుడు ఎమ్మెల్యే వంశీకృష్ణ, ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యేలు రాజేశ్ రెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి సావర్కర్, కార్యదర్శి వంశీ చంద్ రెడ్డితోపాటు పలువురు నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడు జరిగినా.. సింగిల్ డిజిట్‌కే కాంగ్రెస్ పరిమితం: హరీశ్ రావు

హైదరాబాద్,

సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు మళ్లీ నిప్పులు చెరిగారు. మంగళవారం శంషాబాద్ పోలీస్ స్టేషన్ వద్ద హరీశ్ రావు మాట్లాడుతూ.. రేవంత్ నువ్వు మళ్లీ గెలవడం కాదు కదా ప్రతిపక్ష హోదా కూడా నీ పార్టీకి రాదని జోస్యం చెప్పారు. రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడు జరిగినా కాంగ్రెస్ పార్టీ సింగిల్ డిజిట్‌కే పరిమితం అవుతుందని స్పష్టం చేశారు. ప్రభుత్వాన్ని ప్రతిపక్షాలు ప్రశ్నిస్తే అరెస్టులు చేస్తున్నారని చెప్పారు. పరిగిలో రైతులను పరామర్శించేందుకు వెళ్తుంటే తమను అరెస్టు చేశారని పేర్కొన్నారు.రేవంత్ రెడ్డి పాలన.. గడీల పాలన.. బేడీల పాలన.. గుడ్డి పాలన అంటూ హరీశ్ రావు అభివర్ణించారు. సాగుకు పనికిరాని భూముల్లో పరిశ్రమలు పెట్టండంటూ ప్రభుత్వానికి ఈ సందర్భంగా ఆయన సూచించారు. ఎస్సీ, ఎస్టీ రైతులు సాగు చేసుకుంటున్నా భూములను ఎందుకు లాక్కుంటున్నారంటూ ప్రభుత్వాన్ని సూటిగా ఆయన ప్రశ్నించారు. మీ పాలన అంతా బోగస్ మాటలు.. బోగస్ పాలన అంటూ రేవంత్ పరిపాలనను ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డికి మించిన రావణాసురుడు ఎవరైనా ఉన్నారా? అని ఈ సందర్భంగా హరీశ్ రావు ప్రశ్నించారు.పరిగిలో భూముల లాక్కొని తన సోదరుడికి కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారంటూ సీఎం రేవంత్ రెడ్డిపై హరీశ్ రావు నిప్పులు చెరిగారు. 6 గ్యారెంటీలు 100 రోజుల్లో పూర్తి చేస్తామన్నారు.. 900 రోజులైనా ఎందుకు పూర్తి చేయలేదంటూ సీఎం రేవంత్ రెడ్డిని ఆయన సూటిగా ప్రశ్నించారు. రామరాజ్యం వస్తుంది.. కేసీఆర్ రాజ్యం వస్తుందని ఈ సందర్భంగా హరీశ్ రావు విశ్వాసం వ్యక్తం చేశారు. పరిగిలో రైతులకు మద్దతు తెలిపేందుకు వెళ్తున్న హరీశ్ రావుతో ఆయన అనుచరులను పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం వారిని శంషాబాద్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దాంతో హరీశ్ రావు పైవిధంగా స్పందించారు.

# 140 లక్షల మంది ఇరానియన్లు ప్రాణత్యాగానికి సిద్ధం: ఇరాన్ అధ్యక్షుడు

టెహ్రాన్: న్యూస్‌వార్ ప్రతినిధి

హోర్ముజ్ జలసంధిని తెరవకుంటే ఇరాన్‌ను సర్వనాశనం చేస్తామంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన గడువు సమీపిస్తుండగా ఇరాన్ అధ్యక్షుడు పెజిష్కియాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. దేశాన్ని కాపాడుకునేందుకు ఇరాన్ ప్రజలు ప్రాణత్యాగానికి కూడా సిద్ధంగా ఉన్నారని సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. దేశం కోసం తాను సైతం ప్రాణత్యాగానికి సిద్ధమేనని అన్నారు.'ఇరాన్‌ను కాపాడుకునేందుకు ప్రాణత్యాగానికి సిద్ధమని ఇప్పటి వరకూ 140 లక్షల మందికి పైగా ఇరాన్ ప్రజలు ప్రకటించారు. నేను సైతం ఇరాన్ కోసం ప్రాణత్యాగానికి సిద్ధం' అని పెజిష్కియాన్ పేర్కొన్నారు.

మానవహారంగా ఏర్పడండి..హోర్ముజ్‌ను తెరవకపోతే ఇరాన్‌లోని వంతెనలు, విద్యుత్ కేంద్రాలను నేలమట్టం చేస్తామని ట్రంప్ హెచ్చరికలతో ఇరాన్ ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టింది. అమెరికా దాడుల నుంచి విద్యుత్ కేంద్రాలను పరిరక్షించుకునేందుకు క్రీడాకారులు, విద్యార్థులు సహా యువత స్వచ్ఛందంగా విద్యుత్ కేంద్రాల వద్దకు మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు ర్యాలీగా రావాలని, మానవహారంగా ఏర్పడాలని ఆ దేశ క్రీడలు, యువజన శాఖ మంత్రి అలీ రెజా రహీమీ పిలుపునిచ్చారు. ఉజ్వల భవిష్యత్తు కోసం ఇరాన్ యువత మానవహారం పేరుతో ఈ కార్యక్రమం చేపట్టాలని ఒక వీడియో సందేశంలో ఆయన కోరారు. మంగళవారం రాత్రి 8 గంటల లోగా హోర్ముజ్‌ను తెరవకపోతే ఇక గడువు పొడిగింపులు ఉండవని, ఒక్క రాత్రిలోనే తన బలగాలు ఇరాన్‌ను తుడిచి పెట్టేయగలవని ట్రంప్ హెచ్చరించారు. ఈ క్రమంలో ప్రాణత్యాగానికి తనతో పాటు, 1.4 కోట్ల ప్రజానీకం సిద్ధంగా ఉన్నారంటూ పెజిష్కియాన్ ప్రకటించడంతో పరిస్థితి మరింత ఆందోళకరంగా మారింది.

# భారత ఆర్మీ చేతికి ఆత్మాహుతి డ్రోన్స్

ఇంటర్నెట్ డెస్క్:

ఆధునిక యుద్ధ తంత్రంలో డ్రోన్స్ కీలకంగా మారాయి. గెలుపోటములను ప్రభావితం చేసే స్థాయికీ డ్రోన్స్ చేరుకున్నాయని రక్షణ రంగ నిపుణులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో భారత్ అమ్ములపొదిలోకి మరో కీలక అస్త్రం వచ్చి చేరింది. శత్రుమూకలకు వెన్నులో వణుకు పుట్టించే ఆత్మాహుతి డ్రోన్స్‌ను (కామెకాజీ డ్రోన్స్) గుజరాత్‌లోని సూరత్‌కు చెందిన ఇన్‌సైడ్ ఎఫ్‌పీవీ సంస్థ సైన్యానికి తాజాగా అప్పగించింది. వీటి కోసం రూ.10 కోట్లకు గతంలో ఆర్మీ ఒప్పందం కుదుర్చుకోగా తాజాగా వందల సంఖ్యలో ఈ డ్రోన్‌లను ఇన్‌సైడ్ ఎఫ్‌పీవీ డెలివరీ చేసినట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి.గతేడాది డిసెంబర్‌లోనే ఈ ఒప్పందం కుదరగా అత్యవసర ప్రాతిపదికన నెలల వ్యవధిలోనే కంపెనీ ఈ డ్రోన్స్‌ను సరఫరా చేసింది. మైనస్ 35 డిగ్రీల ఉష్ణోగ్రతలు ఉండే కఠిన వాతావరణంలో కూడా పనిచేసేలా ఈ డ్రోన్స్‌ను డిజైన్ చేశామని సంస్థ వెల్లడించింది. యుద్ధ స్థలంలోని పరిస్థితులను రియల్‌టైమ్‌లో తెలుసుకునేందుకు ఉద్దేశించిన ఫస్ట్ పర్సన్ వ్యూ డ్రోన్స్ తయారీకి కూడా ఇన్‌సైడ్ ఎఫ్‌పీవీ పేరుగాంచింది.

## ఏమిటీ కామెకాజీ డ్రోన్స్


నిపుణులు చెప్పే దాని ప్రకారం, ఏఐ ఆధారిత గైడెన్స్ వ్యవస్థ ఉన్న ఈ డ్రోన్స్ 2.5 కిలోల వరకూ పేలుడు పదార్థాలను తీసుకెళ్లగలవు. 120 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించే ఈ డ్రోన్స్ 10 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ధ్వంసం చేస్తాయి. సంప్రదాయక దళాలు చేరుకోలేని ప్రాంతాల్లో అత్యధిక రిస్క్ ఉన్న మిషన్స్ కోసం వీటిని వినియోగిస్తారు. శత్రుదేశంలోని లక్ష్యాలపై అత్యంత కచ్చితత్వంగా వేగంగా దాడి చేసేందుకు ఈ డ్రోన్స్‌ను ప్రధానంగా వినియోగిస్తారని రక్షణ రంగ నిపుణులు చెబుతున్నారు.



**సంపాదకీయం...**

## పాషాణ హృదయాలపై 'పెంబి' ఆదివాసీల గర్జన

తెలంగాణ మ్యాప్‌లో ప్రస్తుత నిర్మల్ జిల్లాలోని 'పెంబి' ఒక చిన్న మండలం కావచ్చు, కానీ అక్కడ నివసించే గిరిజనుల పోరాట చరిత్ర హిమాలయమంత సాంద్రత కలిగినదిగానే చూడక తప్పదు. నిర్లక్ష్యానికి గురైన ఒక జాతి, తమ అస్తిత్వం కోసం, ఆత్మగౌరవం కోసం పాలకుల కోటల పునాదులను కదిలించే ఒక 'ప్రజా ఉద్యమం' సాగించిన చరిత్రక ఆనవాళ్లతో తమ ప్రాంత సమస్యలు పరిష్కరించాలని ప్రస్తుతం నినదిస్తున్నారు. నాడు కొమురం భీమ్ సాగించిన జల్ జంగిల్ జమీన్ పోరాటం నేటికీ పెంబి అడవుల్లో ప్రతిధ్వనిస్తూనే ఉందనట్లుగా ప్రస్తుత పరిస్థితి తెలుపుతున్నది. అభివృద్ధి అంటే హైవేలు, ఐటి టవర్లు, కాంక్రీట్ కట్టడాలు అని భావించే వారికి, పెంబిలోని దోత్తివాగు, కడం వాగులు ఒక చేదు నిజాన్ని గుర్తు చేస్తున్నాయి. వర్షాకాలం వస్తే ఈ మండలంలోని పలు ఆవాస గూడేలు ఒక 'బహిరంగ జైలు'గా మారుతోందనటమే ఇందుకు సాక్ష్యం. 'పెంబి' మండలంలో 24 గ్రామ పంచాయతీలు ఉండగా 3 గ్రామపంచాయతీల పరిధిలోని 16 ఆవాస గ్రామాల పరిస్థితి అగమ్యగోచరమే. వర్షకాలంలో ఎక్కడికక్కడ స్తంభించిపోవడం తప్ప మరోమార్గం లేని పరిస్థితి. దొందారి గ్రామపంచాయతీ పరిధిలోని చాకీరేవు గూడెంలో సుమారు 30 కుటుంబాలు ఉండగా ఒకటే బోరింగ్ ఉంది. ఈ లెక్కన కనీసం సరిపడ తాగునీటి వసతి కూడా లేదనేది అర్థం చేసుకోవాల్సిన అంశం. పక్కనే ఉన్న వాగులో అన్నీ రకాల నీటి సౌకర్యం తీర్చుకోవాల్సిందే. కరెంట్ ఉండదు. ఈ గూడెంలో ఫోన్ సిగ్నల్ ఉండదు. ఆ మండలంలో ఆదివాసీ ఆవాసాలకు, గూడెలకు వంతెనల నిర్మాణం లేకపోవడం వల్ల కేవలం రవాణా వ్యవస్థ మాత్రమే ఆగడం లేదు. అక్కడ ఒక తరం విద్యకు, మెరుగైన వైద్యానికి దూరమవుతోందని గ్రహించాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వ ఆసుపత్రిలో రెగ్యులర్ మెడికల్ ఆఫీసర్ లేకపోవడం, అంగన్‌వాడీ పోస్టులు కూడా భర్తీ కాకుండా ఖాళీగా ఉండటం అంటే పెంబి మండలంలో పుట్టబోయే తరాన్ని పౌష్టికాహార లోపానికి, మరణానికి దగ్గర చేయడమే అవుతుంది. పసుపుల, మందపెల్లి, రాజురా వంతెనలు సంవత్సరాలుగా అసంపూర్తిగా ఉండటం అనేది ఇంజనీరింగ్ లోపం కాదు, అది ప్రభుత్వ ప్రభుత్వాధికారుల నిర్లక్ష్య లోపం అనడంలో తప్పేమీ లేదేమో..! ముందే చెప్పినట్లుగా అభివృద్ధి అంటే కేవలం కాంక్రీటు కట్టడాలు మాత్రమే కాదు. అడవి బిడ్డల కన్నీళ్లు కూడా తుడవడమని పాలకులు ఎప్పుడు గుర్తిస్తారు? అభివృద్ధి నినాదాలు ఆకాశాన్ని తాకుతున్నా పెంబి గడ్డపై ఆదివాసీల జీవితాలు మాత్రం ఇంకా వాగుల మధ్య, అడవి కంచెల మధ్య బందీ అయి ఉన్నాయంటే ఎలా అర్థం చేసుకోవాలి? ఇలాంటి పరిస్థితిలో తాజాగా సిపిఎం పార్టీ నేతృత్వంలో (మార్చి 21, 2026న) యాపలగూడ నుంచి ప్రారంభమైన పాదయాత్రను పెంబి గిరిజనులు ప్రారంభించారు. దీనికి ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు ఉడుత రవీందర్, నిర్మల్ జిల్లా కార్యదర్శి గౌతం కృష్ణ, కార్యదర్శి వర్గ సభ్యులు సురేష్, స్థానిక నాయకులు శంభు, నిర్మలాభాయ్, ధర్మరాజు, పగ్గు తదితరులు నాయకత్వం వహిస్తున్నారు. పెంబి మండల అభివృద్ధిని కాంక్షిస్తూ తలపెట్టిన ఈ పాదయాత్రను రాజకీయ అభిప్రాయాలకు అతీతంగా స్వాగతించాలి. ఇది కేవలం ఒక రాజకీయ కార్యక్రమం కాదు. ఒక రకంగా ఇది పెంబి గిరిజన గుండె రగిలించిన నిప్పుకణికగా భావించాల్సి వస్తున్నది. ఎందుకంటే దోత్తివాగు, కడం వాగులు నేటికీ ఆదివాసీలకు శాపంగా మారాయి. మరోవైపు అత్యవసర వైద్యం అందక గర్భిణులు, రోగులు వాగుల ఒడ్డునే ప్రాణాలు వదిలేస్తున్న సందర్భాలు ఉన్నాయని ఆ ప్రాంతవాసులు ఆవేదన చెందుతున్నారు. ఈ స్థితిని చూసి పాలకులు, ప్రభుత్వాధికారుల గుండె కరగకపోవడం శోచనీయమే అవుతుంది. మరోవైపు పసుపుల, మందపెల్లి, రాజురా వంతెనల నిర్మాణం దశాబ్దాలుగా ఎందుకు అసంపూర్తిగా ఉందో సమాధానం చెప్పే నాథుడే లేడు. ఇంకోవైపు పోడు భూములే గిరిజనుడి జీవనాధారం. మరిన్ని కనుగొనండి వార్తాపత్రిక సబ్‌స్క్రిప్షన్ టెక్ ట్రెండ్స్ ఇంటర్ పరీక్షల గైడ్‌లు ాశ్రీంశీ =ఝుస – డొనాల్డ్ ట్రంప్ మలి జూదం తరతరాలుగా సాగు చేసుకుంటున్న భూములకు హక్కు పట్టాలు ఇవ్వకుండా అటవీ శాఖ అడ్డంకులు సృష్టించడం అన్యాయమే అవుతుంది. 'అడవి మాది.. అడవిలో పుట్టిన చెట్టు, పుట్ట మావి.. కానీ మా భూమి మాది కాదా..?' అని పెంబి ప్రాంత గిరిజనులు పడుతున్న ఆవేదన నేడు అనేక ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. ఒకరకంగా 'అడవిని నమ్ముకున్న వాడికి అడవిపై హక్కు లేకపోవడం' ఈ శతాబ్దపు అతిపెద్ద విషాదం. పోడు భూములకు హక్కు పట్టాలు ఇవ్వకపోవడం ద్వారా ప్రభుత్వం గిరిజనులను వారి సొంత గడ్డపైనే 'ఆక్రమణదారులు'గా చిత్రీకరిస్తోంది. అడవి అంటే చెట్లు మాత్రమే కాదు, ఆ చెట్ల నీడన బతికే మనుషులు కూడా అని ఈ వ్యవస్థ గుర్తించకపోవడం దురదృష్టకరమైన అంశం. ఇలాంటి అనేక సమస్యలన్నీ పెంబి మండలాన్ని వెనుకబాటుతనానికి సాక్ష్యంగా నిలుపుతున్నది. ఈ పరిస్థితుల్లో సిరిచల్మా నుంచి పులగంపండ్రి వరకు రహదారులు పడలాన్న, ప్రతి గిరిజనుడికి పట్టా అందాలన్నా, కరెంటు వెలుగులు విరజిమ్మాలన్నా ఐక్యతతోనే సాధ్యం. ఆ ఐక్యతను చాటిచెప్పాల్సిన అవసరం ఉంది. హక్కులను సాధించుకునే వరకు విశ్రమించని పోరాటంగా చూడక తప్పదు. అడవి బిడ్డల ఆత్మగౌరవం చాటడానికి, రాబోయే తరాల బంగారు భవిష్యత్తు కోసం ఐక్యంగా ముందుకు సాగాల్సిన అవసరం ఉంది. పాలకులారా మాకు కావాల్సింది ఓట్ల పండగలో ఇచ్చే హామీలు కావు, మా వాగులపై వంతెనలు, మా భూములపై హక్కులు, మా గూడెంలో విద్య, వైద్యం!' సొంతగూడు కావాలని ఈ పాదయాత్రలో వినిపించే ప్రతి అడుగు చప్పుడు పాలకుల నిద్రను చెదగొట్టేలా ఉండాలి. ఇది కేవలం సిపిఐ(ఎం) పిలుపు మాత్రమే కాదు, పెంబి గడ్డపై దశాబ్దాలుగా అణిచివేయబడిన ఆవేదనకు ప్రతినిధిగా నిలవాల్సి ఉంది. కేవలం తమ పార్టీ కార్యక్రమంలాగా కాకుండా పెంబి మండల సమస్య పరిష్కారం కోసం ప్రశ్నించే యుద్ధభేరీ కావాల్సిన అవసరం ఉంది.



# చంద్రబాబు చేతిలో ఐదూళ్ల భవిష్యత్

### భద్రాచలం అభివృద్ధికి ఐదూళ్లే ముఖ్యం


### మౌనంగా ఐదు మండలాలను కలుపుకున్న బాబు

### మంత్రి తుమ్మల లేఖతో మరోమారు తెరపైకి సమస్య

**భద్రాచలం,**

భద్రాచలం అభివృద్ధికి, నీటి మునక గండం నుంచి బయటపడడానికి ఇప్పుడు ఐదూళ్లు అవసరం గతంలో విభజన తరవాత ఏకపక్ష నిర్ణయంతో ఐదు మండలాలను ఎపిలో కలిపారు. భద్రాచలానికి ఆనుకొని ఉన్న 5 గ్రామాలను ఏపీ నుంచి వేరుచేసి తెలంగాణలో కలపాలని కేంద్రాన్ని రాష్ట్రం కోరుతోంది. గత కొన్నేళ్లుగా ఈ విషయంలో కేంద్రం నాన్చివేత ధోరణి అవలంబిస్తోంది. ఎపి ప్రభుత్వం కూడా అదే వైఖరితో ఉంది. ఐదు మండలాలను కలపడం వల్లనే పోలవరం సాధ్యం అయ్యిందని పదేపదే చెబుతున్న చంద్రబాబు ఈ విషయంలో పట్టువిడుపులు ప్రకటించడం లేదు. ఉభయ తెలుగు రాష్ట్రాల అభివృద్ధి తనకు ముఖ్యమని ప్రకటించిన చంద్రబాబు ఈ విషయంలో మాత్రం పెదవి విప్పడం లేదు. చంద్రబాబు తలచకుంటే ఈ సమస్య చిటికెలో పరిష్కారం అవుతుంది. పరిపాలన సౌలభ్యం కోసం ఆ ఐదు గ్రామాలను తెలంగాణలో విలీనం చేసి గిరిజనుల ఇబ్బందులు తొలగించాల్సి ఉంది. రాష్ట్ర విభజన సమయంలో ఏపీలో కలిపిన యాటపాక, కన్నాయిగూడెం, పిచ్చికలపాడు, పురుషోత్తపట్నం, గుండాల గ్రామ పంచాయతీలు పరిపాలనపరంగా ఎదుర్కొంటున్న ఇబ్బందులను పదేపదే కేంద్రం దృష్టికి తీసుకుని వెళ్లారు. ఆ ఐదు గ్రామ పంచాయతీల పరిధిలో 19 రెవెన్యూ గ్రామాలు ఉండగా.. తెలంగాణలోని రెండు భాగాల మధ్య ప్రత్యేక పరిస్థితుల్లో ఉన్నాయి. మిగిలిన సరిహద్దులు గోదావరి నది, రిజర్వు ఫారెస్టు ప్రాంతాలతో చుట్టుముట్టు ఉన్నాయి. దీంతో పరిపాలనపరమైన సమస్యలు ఎదురవుతున్నాయి. ప్రజలు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ గ్రామ పంచాయతీలకు పోలవరం ముంపు సమస్యతో ఎలాంటి సంబంధం లేదు. కానీ పరిపాలన, జీవనోపాధి, ప్రజాసేవల కోసం ఆ గ్రామాల ప్రజలు భద్రాచలంపైనే పూర్తిగా ఆధారపడి ఉన్నారు. ఏపీలో కొనసాగటం వల్ల గత 12 ఏళ్లుగా ఇబ్బంది పడుతున్నారు. ఈ గ్రామాల్లోని గిరిజనులు తమ ఊళ్లను తెలంగాణలోనే కలపాలని ఎప్పటి నుంచో కోరుతున్నా, కేంద్రం కానీ, ఎపి కానీ పట్టించుకోవడం లేదు. ఇక, ఆ గ్రామాల ప్రజలు ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే 282 కిమీల దూరం ప్రయాణించాల్సి ఉంటుంది. ఇందుకోసం 8 గంటల సమయం పడుతుందని పేర్కొంటున్నారు. మరోపక్క, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకేంద్రం కేవలం 40 కిమీల దూరంలో ఉన్నదని, గంటలో జిల్లా కేంద్రానికి చేరుకోవచ్చు. ప్రస్తుత సరిహద్దుల కారణంగా వ్యవసాయ ఉత్పత్తులు, అటవీ ఉత్పత్తులు, అవసరమైన సరుకులు తరలించేటప్పుడు తరుచుగా తనిఖీలు, అడ్డంకులు ఎదురవుతున్నాయి. ఈ ప్రాంతం ఛత్తీస్‌గఢ్– ఒడిసా రాష్ట్రాలకు సమీపంలో ఉండటంతో పోలీసింగ్, శాంతిభద్రతల సమస్యలు కూడా తలెత్తుతున్నదని ఆరోపణలు ఉన్నాయి. ఇకపోతే భద్రాద్రి శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయం తెలంగాణలో ఉండగా,ఈ ఆలయానికి సంబంధించిన కొన్ని భూ ములు ప్రస్తుతం పురుషోత్తపట్నం ప్రాంతంలో ఉన్నాయి. ఈ దేవాలయ భూముల విషయంలో గతంలో అక్కడికి వెళ్లిన మహిళా ఇవోపై దాడి జరిగింది. ఇది శాంతిభద్రతల సమస్యగా మారింది. దేవాలయ నిర్వహణ సులభంగా ఉండేందుకు ఈ భూభాగాలను తిరిగి తెలంగాణలో కలపటం అత్యవసరం కూడా. ఈ భౌగోళిక సమస్య కొనసాగితే భద్రాచలం దేవాలయం అభివృద్ధి ప్రణాళికకు ఆటంకం ఏర్పడుతుందని ప్రభుత్వ వర్గాలు కూడా ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. అంతేకాక, ఆ ఐదు గ్రామాలు ఐదో షెడ్యూలులో ఉండటంతో ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు గిరిజనులకు అందటం లేదని గిరిజన నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఆ ఐదు గ్రామ పంచాయతీలు, 19 రెవెన్యూ గ్రామాలు తిరిగి తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోకి కలపాల్సిన అసవరం ఉఎంతైనా ఉందని. కేంద్ర మంత్రి అమిత్‌షాకు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మరోమారు విజ్ఞప్తి చేశారు. ప్రస్తుత పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు ఈ నెల 16 నుంచి జరగబోతతున్నాయి. ఈ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో.. ఇప్పుడే నిర్ణయం తీసుకోవాలని మంత్రి కోరారు. ఈ మేరకు కేంద్ర మంత్రికి ఆయన ఓ లేఖ రాశారు. ఆ ఐదు గ్రామాల సమస్యను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇదివరకే ఏపీ సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారని ఆ లేఖలో పేర్కొన్నారు. అయితే ఇప్పుడు చంద్రబాబు కనుక నిర్ణయం తీసుకుంటే సమస్య సులువుగా పరిష్కారం అవుతుంది. అందుకు ఆయన సానుకూలంగా ముందుకు రావాల్సి ఉంది.





## విశాఖ స్టీల్‌ను వదిలించుకునే కుట్రలు

### నక్కపల్లిలో స్టీల్‌ప్లాంట్ ప్రారంభించడంపై అనుమానాలు

### సొంత గనులు కేటాయిస్తేనే విశాఖ స్టీల్‌కు మనుగడ

### సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి. హెచ్.నరసింగరావు

**విశాఖపట్టణ,**

నక్కపల్లిలో స్టీల్‌ప్లాంట్ ప్రారంభించి 20 వేల ఎకరాల భూమి ఉన్న విశాఖ స్టీల్‌ను కబ్జా చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మిట్టల్‌తో కుట్ర చేస్తున్నాయని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి. హెచ్.నరసింగరావు ఆరోపించారు. అందుకే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విశాఖ స్టీల్ ప్లాంట్‌ని సిక్ ప్లాంట్‌గా మారుస్తున్నాయని అన్నారు. అనకాపల్లి నక్కపల్లి దగ్గర 'ఆర్సెలార్ మిట్టల్ నిప్పన్ ఇండియా' కంపెనీ శంకుస్థాపన గత నెలలో ఆర్భాటంగా జరిగింది. 2029 నాటికి 8.2 మిలియన్ మెట్రిక్ టన్నుల ఉత్పత్తిని స్టీల్‌ఎ÷–లాంట్ ప్రారంభిస్తుందని ప్రకటించారు. రూ.1.5 లక్షల కోట్లతో లక్ష మందికి ఉపాధి కల్పిస్తారని రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రకటించారు. మిట్టల్ యాజమాన్యంతో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ముచ్చట్లు అందరూ వీడియోలో చూశాం. నక్కపల్లి దగ్గర స్వాధీనం చేసుకున్న రెండు వేల ఎకరాల్లో 24 మెట్రిక్ టన్నుల ఉత్పత్తి చేయడం ప్రపంచ వింత అవుతుందన్నారు. పరిశ్రమలు అభివృద్ధి కావాలన్నా ప్రభుత్వ విధానాలే మూలం. ప్రైవేటీకరణ పేరుతో దేశ సంపదను కార్పొరేట్లకు దోచిపెట్టే విధానాన్ని మోడీ, చంద్రబాబు జోడీ అమలు చేస్తున్నదని,అందులో భాగంగా ఆర్సెలార్ మిట్టల్, జపాన్ నిప్పన్ ద్వయానికి సుమారు రూ.25 వేల కోట్ల రాష్ట్ర సంపదను హారతి పళ్ళెంలో పెట్టి సమర్పించడం ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ద్రోహం చేయడమేనని అన్నారు. భూములను చౌకగా ఇవ్వడం, ఎన్.ఎం.డి.సి నుంచి గనులు ఇప్పించడం, నక్కపల్లి పోర్టును మిట్టల్‌కు కట్టబెట్టడం, విశాఖ స్టీల్‌కు విశాఖ ప్రజలకు నీరందించే 'ఏలేరు కాలువ' నుంచి 30 యం.జి.డి ల నీటిని మిట్టల్ స్టీల్‌ప్లాంట్‌కు మళ్లించడం, 30 సంవత్సరాలు జీఎస్టీని రద్దు చేయడం, అన్నిటి కంటే ముఖ్యంగా యూనిట్ విద్యుత్తుకు ఒక్క రూపాయి వసూలు చేయడం ఏ విధంగా సబబు అవుతుందో పాలకులు చెప్పాలన్నారు. మరోవైపున 35 సంవత్సరాల నుంచి సమర్థవంతంగా నడుస్తున్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులను కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి సాధించకపోవడం ఘోరం అన్నారు.. విశాఖ స్టీల్‌కు సొంత గనులు ఉంటే దేశంలోనే నెంబర్ వన్ స్టీల్ అవుతుంది. విశాఖ స్టీల్ నాణ్యత వల్ల విశాఖ స్టీల్ ఒక్కటే వరుసగా నాలుగు సంవత్సరాలు విదేశీ ఎగుమతులు చేసి లాభాలు ఆర్జించింది. కానీ 2021లో విశాఖ స్టీల్‌ను నూరు శాతం ప్రైవేట్‌కు అమ్మాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించినప్పటి నుంచి ఎగుమతులు ఆగిపోయాయన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు లేక ఇనుప ఖనిజాన్ని మార్కెట్లో అత్యధిక ధరలకు కొనడంతో ముడి ఖనిజం కొనుగోలు వ్యయం 74 శాతానికి పెరిగింది. సెయిల్‌లో ముడి ఖనిజం కొనుగోలు వ్యయం 48 శాతంగా వుంది. విశాఖ స్టీల్‌ప్లాంట్ అప్పులపై వడ్డీ రేటు 10 శాతం చెల్లిస్తోంది. సెయిల్‌కు 3.4 శాతం వడ్డీ రేటుగా ఉంది. ఇవన్నీ కేంద్ర ప్రభుత్వం కావాలని విశాఖ స్టీల్‌ఎ÷–లాంట్‌పై వేసిన భారాలు. 2025–26న కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల విశాఖ స్టీల్‌ప్లాంట్ సుమారు రూ.1,800 కోట్లు నష్టాలు భరించింది. కానీ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు కేంద్రం ద్వారా ప్యాకేజి ఇప్పించి లాభాల్లోకి తెప్పించామని తప్పుడు ప్రకటనలు చేస్తున్నారని ఆరోపించారు. విశాఖ స్టీల్‌ఎ÷–లాంట్ కార్మికవర్గంపై తీవ్రంగా దాడి కొనసాగుతోంది. పనిచేస్తున్న వారిని పూర్తిగా నిరుత్సాహపర్చడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్నది. పర్మినెంట్ కార్మికుల నియామకాలు గత ఆరేళ్ల నుంచి లేవు. సుమారు 50 శాతం మందిని ఉద్యోగాల నుంచి రిటైర్మెంట్, వి.ఆర్.ఎస్ పేరుతో యాజమాన్యం బయటికి నెట్టివేసిందన్నారు. ప్లాంట్‌లో ముగ్గురు కార్మికులు పని చేయాల్సిన మూడు యంత్రాలను ఒకే కార్మికుడు నడుపుతున్నాడు. మాట్లాడితే చార్జిషీట్లు, వార్నింగ్ లెటర్లు ఇస్తున్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌లో ఎమర్జెన్సీ వాతావరణం నెలకొంది. అసలు జీతాల్లో సగం జీతాలే చెల్లిస్తున్నారని అన్నారు.

## జగన్‌ను చూసి ప్రజలు చీదరించుకుంటున్నారు

### అమరావతికి ఆమోదించాక ఓర్వలేక మావిగన్ అంటూ వ్యాఖ్యలా

### ఇక జగన్ రాజకీయ జీవితం ముగిసినట్లే: భాను ప్రకాశ్

**తిరుపతి,**

వైసీపీని ఏపీ ప్రజలు చీదరించుకున్నారని.. ఓడిపోయిన తర్వాత రాష్ట్రంపై జగన్ ద్వేషం పెంచుకున్నారని టీటీడీ బోర్డు మెంబర్ భాను ప్రకాశ్ రెడ్డి అన్నారు. పార్లమెంట్ ఉభయసభల్లో అమరావతి బిల్లుకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆమోదం తెలిపారని.. దాన్ని ఓర్వలేక జగన్ 'మావిగన్' అని వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. ఈ మేరకు మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డిపై టీటీడీ బోర్డు మెంబర్ భాను ప్రకాశ్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్‌కు ఒకటే రాజధాని అది అమరావతి అని తేల్చిచెప్పారు. మళ్లీ జగన్ అధికారంలోకి వచ్చేది లేదు.. చూసేది లేదన్నారు. ఏపీలో వైసీపీ అధికారంలోకి వచ్చేది ఒక కల మాత్రమే అని అన్నారు. జగన్ మోహన్ రెడ్డి ఒక కామెడీ యాక్టర్‌గా మిగిలిపోయారని.. ఆ వీడియోలను చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని తెలిపారు. మాజీ సీఎం అపరిచితుడిగా మారిపోయారంటూ వ్యాఖ్యలు చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత ఓ విధంగా.. ఓడిపోయిన తర్వాత మరో విధంగా ఉండే వ్యక్తి జగన్ అంటూ వ్యాఖ్యలు చేశారు. జగన్‌కు గెలుపు ఓటములు సర్వసాధారణమన్నారు. బంగారు పంటలు పండే భూములను రైతులు.. రాష్ట్ర ప్రజలకు అంకితం చేశారని తెలిపారు. అలాంటి రైతుల కళ్లల్లో కన్నీళ్లు పెట్టించి జైల్లో వేసి జగన్ రాక్షసానందం పొందారని విమర్శించారు. ఏపీని అభివృద్ధి ప్రదేశ్‌గా ఎన్డీఏ కూటమి ముందుకు తీసుకెళ్తోందని భాను ప్రకాశ్ వెల్లడించారు. ప్రజలు 2024లో ఓటు అనే గన్ ఆయుధంతో వైసీపీని పేల్చితే.. 164 సీట్లలో పిట్టలుగా లేచిపోయారని.. కేవలం 11 సీట్లు మాత్రం వచ్చాయని అన్నారు. ఇప్పుడు ఆంధప్రదేశ్ ప్రజలు11 సీట్లు కూడా ఇచ్చే పరిస్థితి లేదని వ్యాఖ్యలు చేశారు. ఏపీ ప్రశాంత వాతావరణంలో ఉందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రాష్ట్రంలో శాంతిభద్రతలు బాగున్నాయని చెప్పుకొచ్చారు. జగన్ చేష్టలను ఏపీ ప్రజలు చీదరించుకుంటున్నారని భానుప్రకాశ్ అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్రం అభివృద్ధి బాటలో వెళుతోందన్నారు. 2019లో వైసీపీ ఏపీని అప్పుల ప్రదేశ్‌గా మార్చిందని భాను ప్రకాశ్ విరుచుకుపడ్డారు. జగన్, వైసీపీకి ఏపీ ప్రజలు విడాకులు ఇచ్చారన్నారు. అమరావతి రైతుల శాపం జగన్‌కు తగిలిందన్నారు. ఏపీలో వైసీపీ ఫ్యాన్ తిరగదని.. కామెడీలతో జగన్ శేష జీవితం పూర్తవుతుందని అన్నారు. భూమన కరుణాకర్ రెడ్డికి చేతనైతే జగన్ చేతిలో భగవద్గీత పెట్టాలని సవాల్ విసిరారు. ఇంట్లో దేవాలయాల సెట్లు వేసుకుని.. కనీసం తీర్థం కూడా తీసుకోరంటూ జగన్‌పై భాను ప్రకాశ్ రెడ్డి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.



న్యూస్ వార్
వార్తా పత్రిక

# చందన స్కూల్ లో విద్యార్థులకు దంత పరీక్షలు



**న్యూస్ వార్ చౌటుప్పల్:**

ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని చందన స్కూల్ విద్యార్థులకు ప్రముఖ దంత వైద్యులు డా.పాశం శివకుమార్. ఏర్పాటు చేసిన దంత చికిత్స శిబిరాన్ని చౌటుప్పల్ పురపాలక చైర్ పర్సన్ మోగుదాల పావని రమేష్ గౌడ్ ప్రారంభించారు. స్కూల్ ప్రిన్సిపాల్ అవ్వారు రామేశ్వరి అద్వర్యంలో నిర్వహించిన ఈ శిభిరాన్ని ఉద్దేశించి చైర్ పర్సన్ మోగుదాల పావని మాట్లాడుతూ పిల్లల ఆరోగ్యమే దేశ సౌభాగ్యం అని, విద్యార్థుల ఆరోగ్యం కోసం ఇలాంటి శిబిరాలు ఏర్పాటు చేయాలని జ్ఞానేంద్రియాల ఆరోగ్యం కోసం కలిసికట్టుగా కృషి చేయాలని కోరుతూ, మంచి ఆరోగ్య అలవాట్లను పిల్లలకు నేర్పించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పురపాలక సభ్యులు పాక చిరంజీవి, విశ్రాంత అధ్యాపకుడు నాగభూషణం, సామాజిక ఆరోగ్య అధికారి బడుగు శ్రీరాములు, శంకర్, స్కూల్ డైరెక్టర్ అవ్వారు గోవర్ధన్ అధ్యాపక బృందం కే స్వప్న పద్మ అర్చన,గీత, జగదీశ్వరి, స్వప్న, లావణ్య, దీప, తేజ, ఉష, సంధ్యారాణి పాల్గొన్నారు.

## ఆరోగ్య లక్ష్మి కమిటీ ఎన్నిక

**చైర్ పర్సన్ గా మామిడి విజయలక్ష్మి వెంకట్**

మండల పరిధిలోని అనంతారం అంగన్వాడి కేంద్రం -3 లో అంగన్వాడి స్థాయి పర్యవేక్షణ సహాయ కమిటీ (ఏ ఎల్ ఎం ఎస్ సి)ని మంగళవారం స్థానిక సర్పంచ్ మామిడి శోభ శ్రీనివాస్, అంగన్వాడి సూపర్వైజర్ స్వప్న ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది కమిటీ చైర్ పర్సన్ గా మామిడి విజయలక్ష్మి వెంకట్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు కమిటీ సభ్యులుగా మామిడి శ్రావణి, గర్నె శిరీష,గార్లపాటి మమత, మామిడి అక్కమ్మ, సబిత, విజయ్ కుమార్,సిరి నందిత ఆరాధ్య, బక్కారెడ్డి రాణి,కమిటి కన్వీనర్ గా అంగన్వాడి టీచర్ బి వసంత ఎన్నికయ్యారు ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ అంగన్వాడి సేవలను గర్భిణీలు, బాలింతలు, చిన్న పిల్లలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు నూతన చైర్పర్సన్ మాట్లాడుతూ అంగన్వాడి అందించే సేవలను లబ్ధిదారుల అభివృద్ధికి తోడ్పడతాయని అంగన్వాడి కేంద్రాన్ని ఉత్తమ అంగన్వాడి కేంద్రంగా గుర్తింపు తెచ్చేందుకు తమ వంతు కృషి చేస్తామన్నారు ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ షేక్ జానిమియా, మామిడి వెంకట్, గ్రామ పెద్దలు మామిడి శ్రీనివాస్, లబ్ధిదారులు భీంపంగి మంజుల, స్వప్న,పద్మ, నాగమ్మ,తదితరులు పాల్గొన్నారు...

## చైర్ పర్సన్ గా మామిడి విజయలక్ష్మి వెంకట్

మండల పరిధిలోని అనంతారం అంగన్వాడి కేంద్రం -3 లో అంగన్వాడి స్థాయి పర్యవేక్షణ సహాయ కమిటీ (ఏ ఎల్ ఎం ఎస్ సి)ని మంగళవారం స్థానిక సర్పంచ్ మామిడి శోభ శ్రీనివాస్, అంగన్వాడి సూపర్వైజర్ స్వప్న ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది కమిటీ చైర్ పర్సన్ గా మామిడి విజయలక్ష్మి వెంకట్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు కమిటీ సభ్యులుగా మామిడి శ్రావణి, గర్నె శిరీష,గార్లపాటి మమత, మామిడి అక్కమ్మ, సబిత, విజయ్ కుమార్,సిరి నందిత ఆరాధ్య, బక్కారెడ్డి రాణి,కమిటి కన్వీనర్ గా అంగన్వాడి టీచర్ బి వసంత ఎన్నికయ్యారు ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ అంగన్వాడి సేవలను గర్భిణీలు, బాలింతలు, చిన్న పిల్లలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు నూతన చైర్పర్సన్ మాట్లాడుతూ అంగన్వాడి అందించే సేవలను లబ్ధిదారుల అభివృద్ధికి తోడ్పడతాయని అంగన్వాడి కేంద్రాన్ని ఉత్తమ అంగన్వాడి కేంద్రంగా గుర్తింపు తెచ్చేందుకు తమ వంతు కృషి చేస్తామన్నారు ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ షేక్ జానిమియా, మామిడి వెంకట్, గ్రామ పెద్దలు మామిడి శ్రీనివాస్, లబ్ధిదారులు భీంపంగి మంజుల, స్వప్న,పద్మ, నాగమ్మ,తదితరులు పాల్గొన్నారు...

## ఘనంగా సురేష్ రావు జన్మదిన వేడుకలు

కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు తూముల సురేష్ రావు జన్మదిన వేడుకలను మండల కేంద్రంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ ఆవరణలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ వగ్గు రవి ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. అనంతరం మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్ లో భారీ కేక్ కట్ చేసి బాణా సంచాలు పేల్చి కార్యకర్తలకు స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. అనంతరం డీజే పాటలకు నృత్యాలతో గ్రామంలో పలు వీధుల గుండా సురేష్ అన్న జిందాబాద్ సురేష్ అన్న నాయకత్వం వర్ధిల్లాలి అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేసుకుంటూ భారీ ర్యాలీ నిర్వహించి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఒగ్గు రవి, కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ సురేష్ రావు నిండు నూరేళ్లు ఇలాంటి పుట్టినరోజులు జరుపుకోవాలని, మరింత ఉన్నత స్థాయి కి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల గ్రామ శాఖల అధ్యక్షులు, మండల నాయకులు చనగాని రాంబాబు, ఎస్కే సైదులు, ఉప సర్పంచ్ గుండెబోయిన జానయ్య, వార్డ్ సభ్యులు నిమ్మల బోయిన సౌజన్య మల్లేష్, కొండ సైదమ్మ సుధాకర్, మాజీ ఉపసర్పంచ్ వగ్గు సైదులు, ఎస్ .కే. నజీర్, ఒగ్గు బిక్షం, మున్నా కొమ్ములయ్య, పేరూరి వెంకటేష్, గుండెబోయిన మల్లేష్, జంజిరాల గోపి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్యమే ప్రతి మనిషికి మహాభాగ్యం

**ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ రాజేష్**

**ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ**

: ఆరోగ్యమే ప్రతి మనిషికి మహాభాగ్యమని ఆరోగ్యవంతమైన వ్యక్తులే సమాజానికి బలమైన పునాదులని ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహిస్తూ సమయానికి వైద్య పరీక్షలు చేయించుకోవాలని మండల వైద్యాధికారి డాక్టర్ రాజేష్ అన్నారు మంగళవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని తన ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుండి గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించి మాట్లాడుతూ ప్రజలకు వ్యక్తిగత పరిశుభ్రత, పోషకాహారం ప్రాముఖ్యత, వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నియమిత వైద్య పరీక్షల అవసరం వంటి అంశాలపై అవగాహన కల్పించారు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని చేతులను శుభ్రంగా కడుక్కోవాలని సూచించారు కిటకాల వ్యాప్తికి సరైన చర్యలు తీసుకోవాలని అన్నారు

# పేదల స్వంతింటి కల కాంగ్రెస్ తోనే సాకారం





**- కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు ధరావత్ వీరన్న నాయక్**

**చివ్వెంల:**

పేదల స్వంతింటి కల కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంతోనే సాకారం అవుతుందని మండల పార్టీ అధ్యక్షులు ధరావత్ వీరన్న నాయక్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని బధ్యతండా గ్రామంలో బానోతు సైదమ్మ కృష్ణల నూతన ఇందిరమ్మ ఇళ్లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పాలకులు 10 సంవత్సరాల్లో ఒక్కరికి కూడా ఇల్లు ఇవ్వలేదని కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎప్పటికీ అర్హులైన వారందరికి ఇండ్లు మంజూరు చేసినట్లు తెలిపారు. మొదటి విడతలో మండల వ్యాప్తంగా 545 ఇండ్లు మంజూరు కాగా ఇప్పటి అన్ని ఇండ్లు పూర్తి కావస్తున్నాయని తెలిపారు. మొదటి విడతలో ఇండ్లు రాని వారు బాధ పడవద్దని వారికి రెండవ విడతలో అర్హులైన వారందరికి ఇండ్లు ఇండ్లు వస్తాయని చెప్పారు. ప్రజా ప్రభుత్వంలో అన్ని వర్గాల అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. రెండవ విడతలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, రాష్ట్ర నాయకులు పోతు భాస్కర్, డిసిసి అధ్యక్షుడు గుడిపాటి నరసయ్యల సహకారంతో అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు, గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానాని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లు ధారవత్ కనకమ్మ సోమాని నాయక్, బానోతు వెంకన్న నాయక్, మాజీ సర్పంచ్ పద్మ మంగ్తియా, నాయకులు బానోతు రాజా, చంప్లా, నాగేశ్వర్ రావు, శ్రీను నాయక్, దేప్ల నాయక్, లాలూ నాయక్, సైదా నాయక్, భాష నాయక్, వీరన్న నాయక్, నాగు నాయక్, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

# వేసవిలో నీటి ఎద్దడి నివారణకు తక్షణ చర్యలు చేపట్టాలి

**- అండర్ గ్రౌండ్ డ్రైనేజి పనులను వేగవంతం చేయాలి**

**- ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి**

**- మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది**





వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని పట్టణంలో నీటి ఎద్దడి నివారణకు తక్షణ చర్యలు చేపట్టాలని ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాదిలు అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని బాలాజీ గ్రాండ్ బ్యాకేట్ హాల్ లో మిషన్ భగీరథ, పబ్లిక్ హెల్త్, మున్సిపల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవి కాలంలో పట్టణ ప్రజలకు త్రాగునీటి ఎద్దడి రాకుండా ఆర్డబ్ల్యూఎస్, పబ్లిక్ హెల్త్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని వారు సూచించారు. వార్డుల్లో త్రాగునీటి సమస్యలు తలెత్తకుండా పకడ్బందీ ప్రణాళిక రూపొందించి ప్రజలకు సరిపడా తాగునీరు అందించాలన్నారు. విలీన గ్రామాలలోని వార్డులలో నీటి సమస్యను ముందస్తుగా గుర్తించి ప్రణాళిక బద్ధంగా మిషన్ భగీరథ నీరు క్రమం తప్పకుండా సరఫరా అయ్యేలా చూడాలని సూచించారు. గత సంవత్సరం నీటి ఎద్దడిని ఎదుర్కొన్న వార్డులలో మరల సమస్య పునరావృతం కాకుండా చూడాలని అందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. మిషన్ భగీరథ ఏఇలు క్షేత్ర స్థాయిలో పర్యటించి త్రాగునీటి సరఫరాలో ఉత్పన్నమయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి సరిచేయాలని అన్నారు.

**అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలి**

జిల్లా కేంద్రంలో జరుగుతున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను కాంట్రాక్టర్ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలనీ, తవ్విన గోతులను వెంటనే పూడ్చి, రోడ్లను యథాస్థితికి తీసుకురావాలని వారు అన్నారు. పనులపై ఎప్పటికప్పుడు మున్సిపల్ అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. రానున్న వర్ష కాలంలో ప్రజలు రోడ్లతో ఇబ్బంది పడే అవకాశం ఉన్నందున పనులను ప్రణాళిక ప్రకారం యుద్ధపాదికన వెంటనే పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్, అధికారులను సూచనలు చేశారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ సిహెచ్ హన్మంతరెడ్డి, మిషన్ భగీరథ, పబ్లిక్ హెల్త్ అధికారులు, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కొనుగోలు కేంద్రాలకు మోక్షం ఎప్పుడో.....?

**ఎదురుచూపులతో నిరీక్షిస్తున్న రైతులు...!**

**ఇప్పటికే 60 శాతానికి పైగా పూర్తయిన వరి కోతలు....!**

**సోద్యం చూస్తున్న ప్రభుత్వ యంత్రాంగం..**

**ప్రభుత్వం ప్రతి క్రాప్ సమయంలో జాప్యం చేస్తున్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు...!**

**మిల్లర్లను కమిషన్ దారులను దళారులను ఆశ్రయిస్తున్న రైతులు...!**

**ఇప్పటికైనా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని రైతుల ఆవేదన....**



రైతులు తాము పండించిన పంటను గిట్టుబాటు ధర లేక దళారుల చేతుల్లో మోసపోవద్దని గత ప్రభుత్వంతోపాటు ఈ ప్రభుత్వం కూడా ఇందిరా క్రాంతి పథకం, ప్రాథమిక సహకార వ్యవసాయ పరపతి సంఘాల ద్వారా ప్రతి క్రాప్ సీజన్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తూ రైతుల ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్న తరుణంలో ఈ యాసంగి పంట సమయం అయిపోయి పంట చేతికి వచ్చి ఇప్పటికే సుమారు 60 శాతం పైగా రైతులు వరి కోతలు పూర్తయినప్పటికీ ఇప్పటివరకు ప్రభుత్వ యంత్రాంగం సంబంధిత అధికారులు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడంలో జాప్యం చేస్తున్నారని కొనుగోలు కేంద్రాలకు మోక్షం ఎప్పుడోనని రైతులు నిరీక్షణతో ఎదురుచూస్తున్నారు కొనుగోలు కేంద్రాల ఏర్పాటు జాప్యమైనా కొద్దీ రైతుల నిరీక్షణ నుండి బయటపడడానికి కమిషన్ దారులను, దళారులను, మిల్లర్లను రైతులు ఆశ్రయించాల్సి వస్తుంది దీంతో పండిన పంట చేతికి వచ్చిన సమయంలో సరైన గిట్టుబాటు ధర లేక ప్రభుత్వం ప్రకటించిన 500 రూపాయల బోనస్ దక్కక రైతులు ఇబ్బందులు పడే పరిస్థితి దాపురించింది ఇంత జరుగుతున్న రైతుల పట్ల కనికరం లేని ప్రభుత్వ ఉన్నతాధికారులు సోద్యం చూస్తున్నారని చెప్పాలి ఆరు కాలం పండించి పంట చేతికి వచ్చి తెచ్చిన రుణాలు పెట్టిన పెట్టుబడులు ఎల్లపుచ్చుకోవడానికి రైతులు పంటను అమ్ముకోవడానికి వెంటనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని రైతుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ప్రతిసారి రబీ, ఖరీఫ్ సీజన్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాల్సిన ప్రభుత్వం అధికారులు ఇప్పటివరకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంలో జాప్యం ఏమిటి అని నివ్వరపోతున్నారు

Edited, Printed, Published & Owned by NATAVA KRISHNA RAO, Published from: Krishna Publications, 10-74, Main Road, Chandoor, (Post &Mandal) Nalgonda 508 255, Telangana, Printed at: Krishna Publications, 10-74, Main Road, Chandoor, (Post &Mandal) Nalgonda 508 255,Telangana, Editor:NATAVA KRISHNA RAO, Cell: 9440991979,